నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్ నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 10 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

ఆల శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఆల కుటుంబానికి పరామర్శ

- నివాళులర్పించిన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

భూత్పూర్, జనవరి 9 : దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందగా, మంగళవారం జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నాసాగర్ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆల శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య శ్రీలత, తల్లి వరలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితతోపాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాగా, ఎమ్మెల్సీ రాకను గుర్తించిన బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటి వద్ద బారులుదీరారు. కార్యక్రమంలో వనపర్తి జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నారాయణగౌడ్, ప్రదీప్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఆల శశివర్ధన్‌రెడ్డి భార్య శ్రీలతను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత

వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు
- పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, జనవరి 9 : మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని 20వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌కు సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాభివృద్ధికి నిధుల విడుదల చేయించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అయిజ మున్సిపాలిటీకి డబుల్ ప్లస్ అవార్డు రావడం సంతోషకరమన్నారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పట్టణాభివృద్ధికి పాటుపడాలని కోరారు. 15 అంశాలపై చర్చించిన కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతగా హైలెవల్ వంతెన పనులు..

పట్టణంలోని పెద్దవాగుపై రూ.కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధికారులను ఆదేశించారు. పెద్దవాగుపై వంతెన నిర్మాణం దృష్ట్యా ప్రజలు రవాణాపరంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గ్రహించి పనులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించారు.

పోటీలోత లపడుతున్నమ హబూబ్‌నగర్,కరీ ంనగర్జ ట్లు

క్రీడలతో మానసికోల్లాసం

- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీరామ్మూర్తి
- విద్యుత్ ఉద్యోగులరా ష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 9 : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీరామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో ని స్టేడియంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఎస్ ఈ ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడలు ఉల్లాసాన్ని, ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. టోర్నీలో ఆయా జట్లు ప్రతిభ చాటాలని సూచించారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈలు చంద్రమౌళి, వెంకట శివరామ్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, గేమ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షకీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ..

మహబూబ్‌నగర్ ఆపరేషన్ జట్టు 15-03, 15-08 సెట్ల తేడాతో కరీంనగర్ ఓఎంసీ జట్టుపై గెలిచి శుభారంభం చేసింది. మిగతా మ్యాచ్‌ల్లో ఖమ్మం జట్టు 15-08, 15-10 సెట్ల తేడా నిజామాబాద్‌పై, హైదరాబాద్ సౌత్‌జట్టు 15-10, 10-15, 15-13 సెట్ల తేడాతో మహబూబ్‌నగర్ ఆపరేషన్‌పై గెలిచాయి. టోర్నీలో మహబూబ్‌నగర్ ఆపరేషన్, మహబూబ్‌నగర్ ఓఎంసీ, ఖమ్మం ఆపరేషన్, ఖమ్మం ఓఎంసీ, కరీంనగర్ ఆపరేషన్, కరీంనగర్ ఓఎంసీ, నల్లగొండ ఆపరేషన్, నల్లగొండ ఓఎంసీ, ఆదిలాబాద్ ఆపరేషన్, ఆదిలాబాద్ ఓఎంసీ, హైదరాబాద్ సౌత్, హైదరాబాద్ సెంట్రల్, హబ్సిగూడ ఆపరేషన్ జట్లు తలబడుతున్నాయి. 160 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

కర్ణాటక వ్యక్తి తెలంగాణ ఓటరుగా దరఖాస్తు

మాగనూరు, జనవరి 9 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం నూతన ఓటర్ ఐడీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ క్రమంలో కొందరు అక్రమార్కులు కర్ణాటకలో ఉండి తెలంగాణ రాష్ట్రంలో ఓటరు దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మాగనూరు మండలం బైరంపల్లి-ఉజ్జలి గ్రామం కర్ణాటక బార్డర్ సమీపంలో ఉన్నది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నూతన ఓటర్ల కోసం దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటక వాసులు కొంతమంది ఓటు హక్కు కోసం మీ సేవలో దరఖాస్తు చేశారు. బీఎల్వోలు స్వీకరిస్తున్న నూతన ఓటర్ ఐడీ దరఖాస్తుల సందర్భంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై తాసీల్దార్ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా, తప్పుడు దరఖాస్తులు వస్తే పరిశీలించి తొలగిస్తామన్నారు.

కనులపండువగాశక టోత్సవం

నవాబ్‌పేట, జనవరి 9 : మండలంలోని ఫత్తేపూర్ మైసమ్మ బ్రహోత్సవాల్లో ముఖ్యఘట్టమైన శకటోత్సవం, బోనాల ఉత్సవాలను భక్తులు మంగళవారం భక్తిభ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శకటోత్సవం కనుల పండువగా సాగింది. ఎడ్ల బండ్లు, వాహనాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కృష్ణయ్య, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, ఉపసర్పంచ్ పెంటయ్య, నాయకులు పాశం గోపాల్, సుభాన్‌చారి, రాజు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లనుఊ రేగిస్తున్న భక్తులు

మిల్లర్ల మీనమేషాలు!

వడ్లు లేవు.. బియ్యం రావు

5,98,108 మెట్రిక్ టన్నుల బియ్యం ఎక్కడ?

- సీఎంఆర్ బియ్యం గోల్‌మాల్ దందా
- మిల్లుల్లోపేరు కుపోయినరై స్
- ఎఫ్‌సీఐకిఇ వ్వకుండాకుం టిసాకులు
- అధికారులఆ దేశాలు బేఖాతరు
- బ్లాక్ లిస్టుల్లో పెట్టాలని సీఎస్ ఆదేశం
- ప్రజాప్రతినిధులనుకా కా పడుతున్న వైనం



మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కల్వకుర్తి, జనవరి 9 : రైస్ మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. మిల్లర్లు తమ వద్ద ఉన్న కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) బియ్యాన్ని ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు అప్పగించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ బియ్యాన్ని ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తుంటే.. మరోవైపు మిల్లర్లు ప్రజాప్రతినిధులను కాకా పట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఇంతకు మిల్లర్ల వద్ద సీఎంఆర్ బియ్యం ఉందా..? ఉంటే ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ బియ్యం విషయంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే మిల్లుల యజమానులు ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇందుకోసం సన్మానాల పేరుతో మంత్రితోపాటు ఎమ్మెల్యేలను కలుస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

పెరిగిన వరి సాగుతో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీరు పుష్కలం కావడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగింది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో చాలా ఎక్కువైంది. ఎంజీకేఎల్ఐ పనులు పూర్తి కావడంతో 2017 సంవత్సరం నాటికి కందనూలు జిల్లా వ్యాప్తంగా కృష్ణాజలాలు రైతుల పొలాల్లో పరుగులు పెట్టాయి. సాగునీరు సమృద్ధిగా ఉండటంతో కర్షకులు వరి సాగుపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం విక్రయాల విషయంలో రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో నష్టం వచ్చినా సరే అని కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టింది. ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగించింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం నిల్వలు మిల్లర వద్ద భారీగా పేరుకుపోయాయి. వానకాలం, యాసంగి సీజన్లు 2022-23లకు సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,45,487 మెట్రిక్ టన్నులు, వనపర్తి జిల్లాలో 2.80 లక్షల మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాలో 72,124 మెట్రిక్ టన్నులు, నారాయణపేట జిల్లాలో 80,176 మెట్రిక్ టన్నులు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 20,321 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి మిల్లర్లు అందించాల్సి ఉన్నది. మొత్తంగా 5,98,108 మెట్రిక్ టన్నులు ఇవ్వాలి. ప్రభుత్వానికి నష్టం వచ్చినా సరే రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించి తిరిగి రెవెన్యూ సమకూర్చుకోవాలనే ప్రభుత్వ ఆశయానికి మిల్లర్లు గండి కొడుతున్నారు. బియ్యం మిల్లుల పరిశ్రమకు ఊతం లభిస్తుందని వడ్లను అప్పగిస్తే.. ఇప్పటి వరకు సీఎంఆర్ బియ్యం ఎందుకు అప్పగించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా మంది మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి బియ్యం విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బియ్యం ఇవ్వని మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే మిల్లర్ల వద్ద దాదాపుగా సీఎంఆర్ బియ్యం లేనట్లే. అయితే ఈ బియ్యం అందించని మిల్లర్లపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి మరి.

ఇవ్వాలని అధికారుల ఒత్తిడి..

గడువు పూర్తయిన సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా రైస్ మిల్లర్లు జాప్యం చేస్తుండటంతో అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెచ్చారు. గడువు లోపల ఇవ్వకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా ఎందుకు జాప్యం చేస్తున్నారనే విషయమై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకు మిల్లర్ల వద్ద బియ్యం ఉందా..? లేదా.. అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మిల్లర్లు, ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలిగి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తమ్మీద సీఎంఆర్ బియ్యం విషయంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందనే వాదనలు ఊపందుకున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

మహబూబ్‌నగర్ జిల్లాలో 2022 వానకాలంలో రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం 93,351 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా 83,978 బియ్యాన్ని ఇచ్చారు. 9,373 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. యాసంగి 2022-23 విషయానికొస్తే 76,684 మెట్రిక్ టన్నుల బియ్యానికిగానూ కేవలం 13,932 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎఫ్‌సీఐకి అందజేశారు. 62,752 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. మొత్తంగా చూస్తే 72,124 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉన్నది.

గద్వాల జిల్లాలో అధికారుల తనిఖీ (ఫైల్)

సీఎంఆర్ బియ్యం అంటే..

రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకుగానూ పౌరసరఫరాల శాఖ పీఏసీఎస్, మహిళా సంఘాల ద్వారా ధాన్యాన్ని సేకరింపజేసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాలని ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగించింది. ప్రభుత్వం ఇచ్చిన కోటాను బియ్యంగా మార్చి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో భారత ఆహార సంస్థకు అప్పగించాలి. ఈ బియ్యాన్నే సీఎంఆర్ అంటారు. ధాన్యం విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు కలుగవద్దనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం నష్టాలను భరిస్తూ ధాన్యం కొనుగోలు చేసింది.

పేరుకుపోయిన బియ్యం

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాలో మిల్లర్ల వద్ద సీఎంఆర్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. ఈ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు రైస్ మిల్లర్లు మూటగట్టుకుంటున్నారు. 2022-23 సంవత్సరం వానకాలంలో పౌరసరఫరాల శాఖ 1,38,653 మెట్రిక్ టన్నుల వడ్లను మిల్లర్లుకు అప్పగించింది. దీనికిగానూ 92,953 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. మిల్లర్లు 43,615 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. అంటే 40 శాతం మాత్రమే అందజేశారు. యాసంగి విషయానికొస్తే 1,61,009 మెట్రిక్ టన్నుల వడ్లను మిల్లర్లకు అప్పగిస్తే.. దీనికి వారు 1,08,329 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా కేవలం 12,180 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. అంటే కేవలం 12 శాతం బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 96,149 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉన్నది. వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి మిల్లర్లు ఇంకా 1,45,487 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉన్నది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల జిల్లాలో వానకాలం 2022లో పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి 28,904 మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేసి బియ్యంగా చేసేందుకు మిల్లర్లకు అప్పగించింది. 19,378 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు 16,067 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 3,321 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉన్నది. అదే విధంగా యాసంగి 2022-23లో 24,684 టన్నుల వడ్లను మిల్లర్లకు ఇస్తే ఇప్పటి వరకు కేవలం 1,131 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించారు. దాదాపు 17 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వలేదు. మొత్తంగా చూస్తే 20,321 మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉన్నది. ఈ బియ్యంలో దాదాపు 70 లారీల సీఎంఆర్ బియ్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం డీఎస్పీ అధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఈ బియ్యం విషయంలో అధికారులు సమాచారం ఇవ్వడానికి వెనుకాముందు ఆడుతున్నారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి జిల్లాలో వానకాలం 2022లో మిల్లర్లకు 2,56,243 మెట్రిక్ టన్నుల వడ్లను అప్పగించింది. ఇందుకు 1,70,471 మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉండగా, 65,459 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 1,04,979 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి 2.80 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉన్నది.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలో 2022 వానకాలంలో 85,360 మెట్రిక్ టన్నుల వడ్లను సీఎంఆర్ బియ్యం కోసం మిల్లర్లకు ఇచ్చారు. 57,249 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సిన మిల్లర్లు 48,259 మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి ఇచ్చారు. యాసంగి విషయానికి వస్తే 1,15727 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 78,040 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 6,854 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేశారు. వానకాలం, యాసంగి సీజన్లు కలిసి ఎఫ్‌సీఐకి 80,176 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ఇవ్వాల్సి ఉన్నది.

మాటలతో కాంగ్రెస్ కాలయాపన

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, జనవరి 9 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు వరప్రదాయిని అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి పార్లమెంట్ ఎన్నికలకు ముందే నీళ్లు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆలోచించామని, దురదృష్టవశాత్తు అవకాశం లేకుండా పోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్ రూరల్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కరువుకాటకాలతో అల్లాడుతున్న పాలమూరును సస్యశ్యామలం చేసిందన్నారు. త్వరలోనే పాలమూరు నీళ్లు కూడా తీసుకొచ్చేవారమన్నారు. ప్రస్తుతం ప్రజాపాలనను గాలికొదిలేసి టైంపాస్ చేస్తూ ప్రాజెక్టు పనులు నిలిపివేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం విచారకరమన్నారు. ప్రభుత్వ చర్యలతో మహబూబ్‌నగర్‌లో మళ్లీ వలసలు ప్రారంభమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలుకు భూములు ఇవ్వడానికి భయపడే పరిస్థితులు వచ్చాయన్నారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు తదితర పథకాలను రద్దు చేయడం విచారకరమన్నారు. రెండు లక్షల రుణమాఫీ ప్రకటన చేసి ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ప్రతినెలా పింఛన్ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నదన్నారు. రైతుబంధు ఇంకా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాదాద్రి తరహా మన్యంకొండ అభివృద్ధి చేయాలని భావించగా, పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించి పనులు నిలిపివేసి వెనక్కి పంపించారని విమర్శించారు. పేదలకు ఉపయోగపడే వెయ్యి పడకల దవాఖాన పనులు కూడా నిలిచిపోయాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేసేందుకు ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాగడానికి నీళ్లు కూడా లేని పరిస్థితి నుంచి నట్టింటికి నీళ్లు తీసుకురావడమే కాకుండా అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ అనిత, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహాలక్ష్మి @ 60 లక్షలు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 9 : గత నెల 9 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో డిసెంబర్ 15వ తేదీ నుంచి జీరో టికెట్ జారీ చేయగా, జనవరి 8వ తేదీ వరకు 60,05,101 మంది ప్రయాణించారు. ఇందులో 57,09,985 మంది మహిళలు, 2,95,111 మంది బాలికలు ఉన్నారు. మహబూబ్‌నగర్ డిపో 8,46,412 తో మొదటిస్థానంలో ఉండగా, 8,14,927 మందితో వనపర్తి డిపో రెండు, నాగర్‌కర్నూల్ 7,01,591 మందితో మూడోస్థానంలో నిలిచింది. కల్వకుర్తి 6,79,251, గద్వాల 6,63,733, షాద్‌నగర్ 6,54,508, నారాయణపేట 5,66,997, అచ్చంపేట 5,21,444, కొల్లాపూర్ 4,41,458, కోస్గి 1,14,780 మంది ఉన్నారు.

కృష్ణా బ్రిడ్జి మరమ్మతు వాయిదా

కృష్ణ, జనవరి 9 : మండలంలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు కృష్ణానదిపై ఉన్న వంతెన మరమ్మతు పనులను ఈనెల 17వ తేదీ తర్వాత చేపట్టనున్నట్లు డీఎస్పీ సత్యనారాయణరావు తెలిపారు. ఇటీవల రాయిచూర్ జిల్లా కలెక్టర్ బ్రిజ్జి మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి వంతెనపై వాహనాల రాకపోకలు ఉండవని ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సంక్రాంతి పండుగ సందర్భంగా సరిహద్దులో ప్రయాణికులకు ఇబ్బందులకు గురికాకుండా ఉండడంతోపాటు మండలకేంద్రంలోని క్షీరలింగేశ్వర స్వామి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 17వ తేదీ వరకు మరమ్మతులు చేపట్టకూడదని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు జరిమానా

వనపర్తి, జనవరి 9 : చెత్తే కదా అని రోడ్డుపై పారవేస్తే మున్సిపల్ శాఖ జరిమానా విధిస్తున్నది. జిల్లా కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ చెత్తట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ, దుకాణాల వెంట తిరుగుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంత చెబుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు, ప్రజలు చెత్తను రోడ్లపై పారబోస్తున్నారు. దీంతో మున్సిపల్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం వల్లభనగర్‌లోని మహేశ్వరి మెడికల్ ఏజెన్సీ దుకాణం ఎదుట చెత్తకవర్లు వేయడంతో కోతులు వాటిని రోడ్లపైకి తెచ్చి పడేశాయ